
అంతుచిక్కని ఓటరు నాడి

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతు న్నప్పటికీ ఓటర్ల నాడీ అంతుచిక్కక ప్రధాన రాజకీయ పక్షాలు, అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో తెలియకపోవడం, క్షేత్ర స్థాయిలో పరిస్థితి అర్థం కాకపోవడంతో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బరిలోకి దిగిన మూడు ప్రధాన పార్టీల్లో ఎవరు గెలుస్తారానే దానిపై ఇప్పటికి ఒక స్పష్టత రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులు మాత్రం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య టఫ్ ఫైట్ నడుస్తున్న ట్లు కనిపిస్తోంది. కానీ ఈ పార్టీలో ఎవరి వైపు ఓటర్లు మొగ్గు చూపే అవకాశాలున్నాయో తేలడం లేదు. రోజు రోజుకు పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో ఓట్ల కోసం వేట ముమ్మరం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లతో పాటు బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోదన్ సెగ్మెంట్‌లలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచార పర్వంలో దూసుకుపోతున్నాయి. ఒక వైపు ఓటర్ల నాడిని పసిగట్టడానికి ప్రయత్నిస్తూ..మరో వైపు ప్రచార అస్త్రాలకు పదును పెడుతున్నాయి. ఈ సమయంలో ఓటర్ల నాడిని అంచనా వేయడంలో ప్రధాన రాజకీయ పక్షాలు ముప్పు తిప్పలు పడుతున్నాయి.



- తాజా పరిస్థితులపై..ప్రధాన పార్టీల ఆరా..
- వలస, తటస్థ ఓట్లపై దృష్టి
- ముఖ్య నాయకుల చేరికే లక్ష్యం
- పోలింగ్‌కు మిగిలింది మూడు రోజులే

30 వేల పైచిలుకు ఓటర్లు బతుకు దెరువు కోసం పట్టణాలకు వలస వెళ్లారన్న అంచనా ఉంది.

జిల్లాలోని పలు పట్ట ణాలు, గ్రామాలకు చెందిన పలువురు ఓటర్లు మహారాష్ట్రలోని ముంబాయి, బీవండి, పుణే, హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. భవన నిర్మాణ రంగం, బార్, రెస్టారెంట్, రోజువారి కూలీ, అవుట్ సోర్సింగ్, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యో గాలు చేస్తూ స్థిరపడ్డారు. పలువురు యువతీ యువకులు ఉన్నత విద్య, ఉద్యోగ అవసరాల నిమిత్తం హైద్రాబాద్, సికింద్రాబాద్, ముంబాయి, బెంగుళూరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఓట్ల సమయంలో స్వగ్రామానికి వస్తారు. వీరిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు.

● తటస్థ, వలస ఓటర్లకు గాలం...

తటస్థ, వలస ఓటర్లకు గాలం వేసేందుకు ఎత్తులకు పైఎత్తు వేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ తదితర పట్టణాలకు బతుకు దెరువు కోసం వెళ్లిన కుటుంబాలను కలుస్తూ... ఓటింగ్ రోజు స్వగ్రామాలకు వచ్చేలా ప్రణాళిక చేస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన సుమారు

● చేరికలకు మరింత పదును...

పట్టణం నుంచి పల్లె వరకు కేడర్‌ను తమ పార్టీలో చేర్పురునేలా ప్రణాళిక చేస్తూ..ఎదుటి పార్టీకి ఝులక్ ఇస్తున్నారు. పోలింగ్‌కు మరో వారం రోజుల గడువు మాత్రమే ఉండగా... చేరికలకు మరింత పదును పెట్టారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. రానున్న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని క్షేత్ర స్థాయిలోని లీడర్లు అధికార కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారు. దీనికి తోడు రాష్ట్రంలో అధికారంలో ఉండడం వల్ల మున్ముందు నామినేటెడ్ పోస్టుల భర్తీలో, కాంట్రాక్టు పనులు, ఇతర వ్యవహారాల్లో అవకాశాలు దక్కుతాయన్న ఆశతో పలువురు నేతలు, కార్యకర్తలు, కుల సంఘాల నేతలు కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తిని చూపుతున్నారు. మరికొందరు తమ అక్రమ వ్యవహారాలను చక్క బెట్టుకోవడానికి, గతంలో చేసిన అక్రమాలు బయటకు రాకుండా ఉండడానికి జాగ్రత్త పడుతూ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు.

● జన సమీకరణలో పైచేయి సాధించేలా...

జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రచారంలో పైచేయి సాధించే విధంగా జనసమీకరణ చేస్తున్నారు. రాష్ట్ర పార్టీ అధినాయకత్వం, ముఖ్య నేతలను రంగంలోకి దింపుతూ ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లతో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. ఈ మూడు పార్టీల సంగతి ఇలా ఉంటే....కొందరు స్వతంత్ర అభ్యర్థులు, చిన్నా చితక పార్టీలు సైతం ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. వార్డు, పోలింగ్ బూత్ స్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ప్రచారంలో ఎక్కువ మంది కార్యకర్తలు, జనం కనిపించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

ఎవరికి వారే గొప్పగా చెప్పుకుంటూ...

ఆరు గ్యారెంటీల పథకాలతో ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో అధికార కాంగ్రెస్ బరిలో నిలువగా, ప్రత్యేక రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకం అందించామని బీఆర్ఎస్... తెలంగాణలో జరిగిన ప్రతీ పనిలో కేంద్రం వాటా ఉందంటూ బీజేపీ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు, కుల సంఘాల ఓట్లు కీలకంగా మారనున్నాయి. గెలుపులో ప్రతీ ఓటు కీలకంగా మారనున్న నేపథ్యంలో పార్టీలు ఒక్కరిని కూడా వదలడం లేదు. పార్టీలకు అతీతంగా ఉన్న ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు అనుకూలంగా ఉన్న వారితో సంప్రదింపులు జరుపుతూ ఓటింగ్ శాతం పెంచుకునేలా అన్ని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి.

● గంప గుత్తగా ఓట్లపై...

ఎంపీ అభ్యర్థుల తరపున పార్టీలోని ముఖ్యులు గ్రామాల వారీగా పలు సామాజిక వర్గాలకు చెందిన ఓట్లను గంపగుత్తగా తమ వైపు తిప్పుకునేం దుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు ప్రధాన వ్యక్తుల వద్దకు వెళ్లి తమ పార్టీకి ఓట్లు పడేలా చూడాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. అందివచ్చిన అవకాశాన్ని ఏ పార్టీ కూడా వదిలి పెట్టడం లేదు. ముఖ్యంగా వలస ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. వలస కుటుంబాలకు వాట్సప్ కాల్‌లో టచ్‌లో ఉంటూ..ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. జిల్లాకు బతుకు దెరువు కోసం వచ్చి ఇక్కడే ఓటు హక్కు పొందిన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన హమాలీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇటుక బట్టీ కూలీలు, యజమానుల ఓట్లు సైతం కీలకంగా మరనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ప్రతీ ఓటర్‌ను ఎంపీ అభ్యర్థుల వాయిస్‌తో రికార్డు చేసిన ఫోన్ కాల్ చేస్తూ... ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజకీయ పరిస్థితిపై ఆరా తీస్తున్న పార్టీలు..

ఏ పార్టీకి గెలుపు అంత సులువుగా లేకపోవడంతో క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాయి. ప్రత్యేక సర్వే టీంలను ఏర్పాటు చేసి ఏ రోజుకు ఆ రోజు నివేదికలను తెప్పించుకుంటున్నాయి.

నేరుగా ఓటర్లకు కాల్ చేసి అభిప్రాయాలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియాల్లో పెడుతున్న పోస్టులను బట్టి సదరు ఓటరు, సదరు సామాజిక వర్గం, సదరు ప్రాంతం ఎటువైపు మొగ్గు చూపుతున్నాయో అంచనా వేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో ఇంకా ఎక్కడెక్కడ ఎలాంటి ప్రచారం చేపట్టాలని, ఎలాంటి హామీలను ఇవ్వాలి, ఎవరెవరిని పార్టీలోకి చేర్చుకోవాలన్న దానిపై వ్యూహరచన చేస్తున్నారు.

కుల, మతాల పేరుతో రాజకీయం తగదు

ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడు మృత్యుంజయం



సమావేశంలో మాట్లాడుతున్న మృత్యుంజయం

జగిత్యాల టౌన్, మే 9: కుల, మతాల పేరుతో బీజేపీ నాయకులు రాజకీయం చేయడం తగదని ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం హితవు పలికారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం మృత్యుంజయం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల మయంగా మార్చిన ఘనుడు కేసీఆర్ అని మండిపడ్డారు. తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ అలాంటి తెలంగాణ పదాన్నే మార్చి బీఆర్ఎస్‌గా మార్చారని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల అనంతరం చేసిన తప్పులు తెలుసుకుని కేసీఆర్, కేటీఆర్‌లు విదేశాలకు పారిపోయే పరిస్థితి రాబోతుందని హెచ్చరించారు. త్యాగాలకు మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని తెలుసుకుని అర్వింద్ మాట్లాడాలన్నారు. మోదీ పేరుతో ఎంపీగా గెలిచిన అర్వింద్ ఏనాడైనా ప్రజల బాగోగుల గురించి పట్టించుకున్నావా, ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిని, విద్యాలయాలను సందర్శించారా అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మో హన్ ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి భారీ మెజార్టీని అందించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



వెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, మే 9 : నిజామాబాదు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు భారీ మెజార్టీని అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. గురువారం మండలంలోని వెంకటాపూర్, గుమ్లాపూర్, మాదాపూర్ గ్రామాలలో ఇంటింటి ప్రచారం జడ్‌పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య - రాజేష్, ఎంపీపీ తోట నారాయణల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, కటకం రాజేష్, నత్తి రాజు కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

చెరువు పూడికతీతను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, మే 9 : గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిహామీ పనుల ద్వారా చేపట్టిన చెరువుల పూడికతీత మట్టిని రైతులు తమ పంట చేలలో పోసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఏ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో చెరువు పూడికతీత పనులను గురువారం ఎంపీడీవో ఆకస్మికంగా సందర్శించి పనులను పరిశీలించారు. మస్టర్ రిజిష్టర్‌లను తనిఖీ చేసి, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరిని ఉపాధిహామీ పనులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఏపీవో అనీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి ఉన్నారు.

'విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): టెట్ వ్యవహారంలో విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్న తీరుపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభానికి కారణమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష వివాదం పరిష్కారం పట్ల విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అవసరం లేదంటూ ఏప్రిల్ 8వ తేదిన ఎన్‌సీటీఈ పంపిన వివరణ లేఖను వెల్లడించకుండా ఉపాధ్యాయులందరూ టెట్‌కు దరఖాస్తు చేసుకునే విధంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌పై ప్రభుత్వం సరియైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులందరినీ మానసిక ఆందోళనకు గురిచేయడంతో పాటు దరఖాస్తు చేయడం ద్వారా లక్షల రూపాయాలు వృథా చేయించారని విమర్శించారు. తక్షణమే విద్యాశాఖ కమిషనర్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

మల్యాల, మే 9: మండల కేంద్రంకు చెందిన కొమ్ము గంగు అనే మహిళ మృతి చెందగా బాదిత కుటుంబానికి మల్యాలకు చెందిన దొంతరవేణి శేఖర్-లావణ్య రూ.5వేలు, రెండు బియ్యం సంచులు అందించారు. ఈ కార్యక్రమంలో సంకుర్తి సునీల్, గుడిసె అలాంకర్, శ్రీనివాస్, రఫీక్, శంకర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అర్చకుడి మృతి

రాయికల్, మే 9: నాలుగు దశాబ్దాలకు పైగా శివాలయంలో పూజారిగా విధులు నిర్వర్తిస్తున్న శివలింగం (82) గురువారం కన్నుమూశారు. రాయికల్ పట్టణానికి చెందిన దళితుడైన శివలింగం ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి నాలుగు దశాబ్దాల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. తన సొంత స్థలంలో శివాలయం నిర్మించి శివునికి సపర్యలు చేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి అనారోగ్యానికి గురైన శివలింగం గురువారం మరణించాడు. విషయం తెలుసుకున్న భక్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

మల్యాల, మే 9: మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ కోను లక్ష్మన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరగా పార్టీ కండువా కప్పారు. అలాగే సర్వాపూర్‌కు చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ బైరీ అనంతరెడ్డి బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి వేణు, నేరెళ్ల శ్రావణ్, గాజుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి

ఉమ్మడి కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల టౌన్, మే 9 : రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి గంజ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. గోవర్ధన్‌తో పాటు ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ రమణ. జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశం గౌడ్‌లు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఈ రోడ్‌షోలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

అర్వింద్‌వి జూటా మాటలు

రాయికల్: బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ చెప్పేవన్నీ జూటా మాటలు అని నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రాయికల్ మండలంలోని మైతాపూర్, ఇటిక్యాల, రాయికల్ పట్టణ కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని అన్నారు. ఈ రెండు పార్టీలు దొంగ హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ రైతులను మోసం చేశారని, పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీ తెరిపించలేదన్నారు. అర్వింద్ సోషల్ మీడియాలో తప్ప ప్రజలకు కనబడరని అ న్నారు. దొంగ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే పరిస్థితి లేదని, రాబోయే ఎన్నికల్లో హామీలు నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నా రు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను గుర్తు పెట్టుకుని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్, లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకరలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహణ కల్పిస్తూ రూపొందించిన ఫ్లకార్డులను ప్రదర్శించారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ అధిక శాతం జరిగేలా సహకరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,70,460 మంది ఓటర్లున్నారని, 782 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సుమారు 990 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 36 థిమాటిక్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న కలెక్టర్, ఇతరులు

యువతను మోసం చేస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



జగిత్యాల కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

జగిత్యాల టౌన్, మే 9 : దేశానికి వెన్నుముక అయిన యువతకు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేస్తున్న బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని జంబిగద్దె చౌరస్తాలో గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించగా శ్రీధర్‌బాబు హాజరై మాట్లాడారు. నడిచే నాయకుడు జీవన్ రెడ్డి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళుతున్నామన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాహుల్ గాంధీ నేతృత్వంలో యువ, నారీ, కిసాన్, శ్రామిక, హిస్సేదారి న్యాయ్‌లను అమలు చేసి తీరాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, కొత్త మోహన్, పీసీసీ కార్యదర్శి బండ శంకర్ ఉన్నారు.

కోరుట్ల : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం పట్టణంలోని వివిధ కుల సంఘా లతో పాటు మండలంలోని పైడిమడుగు గ్రామంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో జువ్వాడి కృష్ణారావులతో కలిసి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడారు. నిజామాబాదు ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడెపు మధు, నహీం, భూమయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెట్‌పల్లి : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్ధతుగా నిలబడి చేతు గుర్తుకు ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి విజ య్ ఆజాద్ ప్రజలను కోరారు. గురువారం పట్టణంలోని జాతీయ రహదారి వెం టా వ్యాపార సముదాయంలోని వ్యాపారస్తులన కలిసి కరపత్రాలను అందజేసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేపట్టారు. పట్టణంలోని పలువురు నాయకులు కోరుట్ల నియోజక వర్గం ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు సమక్షంలో పార్టీ చేరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజి రెడ్డి, ఆకుల లింగారెడ్డి, ఎండీ రైస్, జెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర సీనియర్ నాయకుడు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని విట్టంపేట, పెద్దాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని వీరాపూర్ గ్రామంలో నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్ రెడ్డికి మద్ధతుగా గురువారం కాంగ్రెస్ నాయకులు జైనొద్దీన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని నల్లగుట్ట వద్ద పని చేస్తున్న 300 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు దిండిగాల రామస్వామి గౌడ్, సోమ వెంకటేష్ పాల్గొన్నారు.

'దైవ భక్తిని బీజేపీకి ముడిపెట్టడం సరికాదు'

రాయికల్, మే 9: దైవ భక్తిని బీజేపీకి ముడిపెట్టడం సరి కాదని జగిత్యాల మున్సిపల్ ఛైర్మన్ అడువాల జ్యోతి అన్నారు. రాయికల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హిందువులుగా తాము ప్రతి రోజు ఆలయాలకు వెళ్లి దేవుళ్లను పూజిస్తున్నామని, ఆలయాలకు విరాళాలు ఇచ్చామని, కొత్తగా పార్టీ మారిన మీరు ఏమి చేశారో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అనేక దేవాలయాలు అభివృద్ధి అయ్యాయని, స్వతహాగా మీరేం చేశారో చెప్పాలని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో బోగ శ్రావణి ఆడిందే ఆట.. పాడిందే పాటగా బీజేపీలో కొనసాగుతుందని, కొన్ని రోజుల క్రితం ఆమె తీరుతో కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారని ఇటీవల ఎంపీ అభ్యర్థి అర్వింద్ దిష్టిబొమ్మను కూడా దహనం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల అనురాధ, మమత, షర్మిల, వర్షిణి, ఎద్దండి భూమారెడ్డి, రమేష్, నర్సయ్య, చిన్న భూమయ్య, నాగరాజు, రాకేష్ నాయక్, రాజేష్ పాల్గొన్నారు.

అడ్లూరిని కలిసిన జడ్పీటీసీ సభ్యుడు


జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన బుగ్గారం జడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్‌రావు గురువారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వ కంగా కలిశారు. పట్టణంలో విప్ లక్ష్మణ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్చం అందించడంతో పాటు శాలువతో సత్కరించారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ప్రజా సేవకుడు కొప్పులను గెలిపించాలి'

పెగడపల్లి, మే 9 : ప్రజా సేవకుడు నిరంతరం ప్రజలకు అందు బాటులో ఉండే నాయకుడు కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని ఈశ్వర్ కూతురు నందిని అభ్యర్థించారు. గురువారం పెగడ పల్లి మండలంలోని బతికెపల్లి, మద్దులపల్లి గ్రామాలలో మండల నాయకులతో కలసి నందిని ఉపాదిహామీ పని ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడి అందుబాటులో ఉంటూ సేవ చేసే నాయకుడుగా ఈశ్వర్‌కు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ అధ్యక్షులు లోక మల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, తిరుపతి, వెంకటేశం, షకీల్, సంతోష్, రాజశేఖర్ గౌడ్, పాల్గొన్నారు.









నమ్మించి నగదు దోచుకున్న ఇద్దరి అరెస్టు

లక్షెట్టిపేటరూరల్, మే 9: పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కున్నారపు లచ్చవ్వ అనే మహిళకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేసిన ఇద్దరు నిందితులను గురువారం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ నరేందర్, ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు. లచ్చవ్వ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతోంది. కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన శివరాత్రి సదయ్య, పెద్దపల్లి మండలం తుర్కల మద్ది కుంటకు చెందిన గాదాసు రాజయ్యలు ఈ నెల 7న లచ్చవ్వ భర్త బయ టకు వెళ్లడం గమనించి ఇంటి నిర్మాణ పనులకు సిమెంటు, ఇటుక పంపి స్తున్నామని, రూ.25 వేలు ఇవ్వామన్నాడని చెప్పారు. లచ్చవ్వ రూ.24 వేలు ఇవ్వగా అక్కడ నుంచి వెళ్లిపోయారు. భర్త ఇంటికి వచ్చిన తర్వాత తాను ఎవర్ని పంపలేదని చెప్పడంతో మోసపో యానని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక కరీంనగర్ చౌరస్తాలో పోలీసులు వాహనాన్ని చూసి పారి పోతుండగా పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. నింది తుల నుంచి రూ. 23 వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ చంద్రకుమార్

వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి

కాల్వశ్రీరాంపూర్, మే 9: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన తిప్పని వెంకటలక్ష్మి(56) గురువారం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తూ వడదెబ్బకు గురైంది. పనిచేసే చోటనే అస్వస్థకు గురికాగా వెంకటలక్ష్మిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి


కోరుట్ల, మే 9: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బొగడమీది గౌరీ (32) అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆశోక్-గౌరీ దంపతులు కూలీ పనులు చేస్తూ అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన ఆశోక్ తన వెంట మటన్ తీసుకురాగా వంట విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన ఆశోక్ చుట్టు ప్రక్కల వారి సహకారంతో గౌరీని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు గౌరీని మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు తెలిపారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ గౌరీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గౌరీ సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గౌరీకి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.



ఇందిరమ్మ కాలనీలో కార్డన్‌సెర్చ్


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మే 9: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతీ ఇంటిని సోదా చేశారు. కొత్త వ్యక్తుల సమాచారాన్ని సేకరించారు. వాహనాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



వస్త్ర వ్యాపారులు, ఆసాములకు బెదిరింపులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 9: కాంగ్రెస్ నాయకులు కొందరు వస్త్ర వ్యాపారులను, ఆసాములను బెదిరింపులకు గురి చేస్తున్నారని, బలవంతంగా స్టేట్‌మెంట్స్ ఇప్పిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని బోగస్ ముచ్చట చెప్పాడన్నారు. ఐదు సంవత్సరాలలో ఏ పల్లె ఎరగని బండి సంజయ్ తెల్లారితే మోదీ, రాముడు, మతం పేరిట గెలవాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ. 50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రేమ ఉంటే వెంటనే బకాయిలను విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల లోపు వస్త్ర పరిశ్రమకు, వ్యాపారులకు, ఆసాములకు, కార్మికులకు తీపి కబురు చెప్పాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం ప్రచారంలో భాగంగా సిరిసిల్లకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



అదుపు తప్పి ఆటో బోల్తా

ఐదుగురికి గాయాలు

ధర్మారం, మే9: ధర్మారం మండల కేంద్రంలోని ధర్మారం-పెద్దపల్లి రహదారిపై ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలు గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం రాత్రి ధర్మారంలో జరిగిన మంత్రి శ్రీధర్ బాబు రోడ్ షోకు గోపాల్‌రావుపేట గ్రామం నుంచి 8మంది వచ్చారు. తిరి గి ఆటోలో గోపాల్‌రావుపేటకు వెళ్తుండగా ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జంగిలి బక్కయ్య, అందె తులశమ్మ, ఆటో డ్రైవర్ పోతు లచ్చయ్యలకు తీవ్ర గాయాలు కాగా శనిగారపు రాజమ్మ, బింగి మల్లమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పగలు వ్యాపారం.. రాత్రిపూట దొంగతనాలు

- ఘరానా దొంగను అరెస్టు చేసిన పోలీసులు

కుకునూరుపల్లి, మే 9: పగటిపూట బట్టలు అమ్ముతూ, రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను కుకునూరుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐ లతీఫ్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం బర్కత్పుర కాలనీకి చెందిన షేక్ సలీం(53) ఊరూరు తిరుగుతూ బట్టలు అమ్ముతుంటాడు. సలీంకు వచ్చే డబ్బు సరిపోకపోవడంతో రాత్రిపూట దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. సంవత్సర కాలంగా గ్రామాలు, పట్టణాలలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నాడు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాల్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లేవాడు. కుకునూరుపల్లి బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపిస్తూ ఉన్న సలీంను పోలీసులు పట్టుకొని విచారించగా సంవత్సర కాలంగా రాత్రిపూట దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నాడు. సిద్దిపేట, చేర్యాల పట్టణాల్లో, వంటిమామిడి, కొడకండ్ల, నారాయణరావుపేట్ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. భారీ మొత్తంలో బంగారం, నగదును దొంగిలించాడు. కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, క్రైమ్ పార్టీ సిబ్బంది రమేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఈదురు గాలులు.. వర్షం

- తడిసి ముద్దయిన ధాన్యం
- లేచిపోయిన ఇళ్ల పై కప్పు రేకులు
- అన్నదాతల అవస్థలు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి



కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు

కథలాపూర్, మే 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గురువారం ఈదురు గాలులు.. వర్షం కురిసింది. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్లు, ఈదురుగాలులు, భారీ వర్షం బీభత్సం సృష్టించాయి. కలికోట, అంబారిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి ముద్దయింది. రైతులు ధాన్యం ఆరబెట్టుకోగా అనూహ్యంగా కురిసిన వర్షం వల్ల పూర్తిగా ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకం వేసిన ధాన్యం సంచులు తడిచిపోవడంతో మొలకలెత్తే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణం కావడం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొం టున్నారు. అదేవిధంగా పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరి పడ్డాయి. ధాన్యం వద్ద నీళ్లు నిలవగా రైతులు మరో చోటికి తరలించుకుంటున్నారు.

బీర్‌పూర్: మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. 15 నిమిషాల పాటుగా కుండపోతగా కురిసింది. ఆకస్మాత్తుగా కురిసిన వర్షం కారణంగా బీర్‌పూర్‌లోని రెండు కొనుగోలు కేంద్రాలలో, తుంగూర్‌లోని కొనుగోలు కేంద్రంలో, కొల్వాయిలోని కొనుగోలు కేంద్రంలో, కండ్లపెల్లిలోని కొనుగోలు కేంద్రంలో, చెర్లపెల్లి, నర్సింహులపల్లి కొనుగోలు కేంద్రాలలో ఉన్నా వరి ధన్యం రాసులు తడిసిపోయాయి. ఒక్కసారి వర్షం రావడంతో రైతులు ధాన్యంపై కవర్లు వేయలేక పోయారు.

రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఆలాగే రుద్రంగి మండల కేంద్రంలో కురిసిన వర్షనికి ధాన్యం తడిసి ముద్దయిదని రైతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాచర్ వచ్చి చాలా రోజులు గడుస్తున్నా ధాన్యం తూకం వేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చెస్తున్నారు. తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



మానాలలో కురిసిన వడగండ్లు



రుద్రంగిలో తడిసిన ధాన్యం



పెగ్గెర్లలో ఎగిరిపడ్డ రేకులు



బీర్‌పూర్‌లో కురుస్తున్న వర్షం

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన గడ్డి రమేష్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు గురువారం తెలిపారు. తిమ్మాపూర్‌కు చెందిన రమేష్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 7న పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న రమేష్ అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. చీకటి పడిన ఇంటికి రాకపోవడంతో రమేష్ భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

జూలపల్లి, మే 9: మండలంలోని కాచాపూర్ గ్రామంలో గురువారం పుట్ట ప్రశాంత్(32) ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. ట్రాక్టర్ నడుపుకుంటూ కటుంబాన్ని పోషించుకుంటున్న ప్రశాంత్ ఊరచెరువు సమీపంలో కల్వర్టు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో దాని కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన ఐదుగురిపై కేసు

హుజూరాబాద్, మే 9: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్‌ఎంపీ వైద్యులకు విందు ఇచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినందుకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆర్ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఐదుగురి రాజకీయ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, వి రవీందర్‌రావు ఉన్నారు. ఈ కేసులో మరో 20మంది ఉన్నారనిఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బుధవారం రాత్రి ఆర్‌ఎంపీ వైద్యులకు ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకులు విందు ఇవ్వగా కాంగ్రెస్ నాయకులు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశాదరు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడులు చేసి విచారణ చేపట్టారు.

మూడు సెల్‌ఫోన్లు చోరీ

హుజూరాబాద్, మే 9: హుజూరాబాద్ పట్టణంలో గురువారం వారసంతలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. బొప్ప రాజేందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చెడమాపి కృష్ణమూర్తితో పాటు మరొకరు కూరగాయల కోసం మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే జేబులో ఉన్న సెల్‌ఫోన్లు మాయమయ్యాయి. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా గతంలో కూడా ఇదే వారసంతలో చాలా సెల్‌ఫోన్లను దొంగతనం చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మే 9: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురు వ్యక్తులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 5 రోజులు, ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్ష, మొత్తం 12,500 రూపాయల జరిమానాను జడ్జి విధించారని సీఐ తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 32వేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9: కరీంనగర్‌లో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో వేరు వేరు ఘటనల్లో సరైన ఆధారాలు లేని మొత్తం 12 లక్షల 56 వేల 3 వందల రూపాయల నగదు పట్టుబడింది. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టేందుకు కరీంనగర్‌లోని పలుచోట్ల వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్‌చౌక్‌లో నిర్వహించిన వాహనాల తనిఖీలో అశోక్‌నగర్‌కు చెందిన నార్ల నరేష్‌కుమార్ వద్ద లక్షా 60 వేలు, కమాన్‌రోడ్‌కు చెందిన విజయరాఘవన్ విబిన్ వద్ద 2 లక్షల 40 వేలు రూపాయలు పట్టుబడ్డాయి. ఈ నగదును సీజ్ చేసి తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ సరిలాల్ తెలిపారు. అలాగే మూడో ఠాణా పరిధిలోని కాపువాడ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తఖీల్లో బహదూర్‌ఖాన్ పేటకు చెందిన టి సంజీవ్ వద్ద 3 లక్షల 76 వేల 300 రూపాయల నగదు, నాకా చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కిసాన్‌నగ ర్‌కు చెందిన జె రమేష్ వద్ద 2 లక్షల 5 వేల రూపాయలు, కోర్టు చౌరస్తా వద్ద విద్యానగర్‌కు చెందిన పౌలోజు నందం వద్ద లక్షా 75 వేలు, వావిలాలపల్లికి చెందిన జె శ్రీనివాస్ వద్ద లక్ష రూపాయల నగదు పట్టుబడిందని, ఈ నగ దును సీజ్ చేసి సంబం ధిత ఎన్నికల విభాగం అధికారులకు స్వాధీనం చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.



పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ సరిలాల్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు

- నగదు, వెండి వస్తువులు స్వాధీనం

కరీంనగర్‌లోని కోర్టుచౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామానికి చెందిన కట్ట శ్రీనివాసచారి వద్ద సరైన ఆధారాలులేని 4 లక్షల 36 వేల 300 రూపాయల నగదును పట్టుకున్నారు. అలాగే గుంటూరు జిల్లా తెనాలి మండలం, నెలపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గొప్ప రాజు వద్ద దాదాపు 3 లక్షల విలువైన 4 కిలోల వెండి వస్తువులు బహుమతులను పట్టుకున్నట్లు రెండో ఠాణా సీఐ సీఐ విజయ్ కుమార్ తెలిపారు. పట్టుబడిన నగదు, వెండి బహుమతులను తదుప రి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు.

జగిత్యాలలో తనిఖీలు

జగిత్యాల టౌన్, మే 9 : జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 13.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు.

కొండగట్టులో యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 9: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన సిరిగిరి సమ్మయ్య(37)అనే వ్యక్తి దిగువ కొండగట్టులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో జరిగిన రైలు ప్రమాదంలో కుడి కాలు, చేతి కోల్పోవడంతో తీవ్ర మనస్తాపంతో ఉన్న సమ్మయ్య కుటుంబపోషణకు గాను పని చేయడానికి వారం రోజుల క్రితం కొండగట్టు వచ్చాడు. అయితే గురువారం ఓ హోటల్ ముందు మృతి చెంది ఉండడంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సమ్మయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు

ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఏకలవ్య గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం 2023-2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల ఆర్‌సీవో డీఎస్. వెంకన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట(బాలికలు), మరిమడ్ల(బాలురు) కళాశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 9 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతి మార్కుల ప్రతిభ ఆధారంగా ఈ నెల 24న ఉదయం 9 గంటల నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఏకలవ్య గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రారంభమైన ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు

తిమ్మాపూర్, మే 9: ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలు శుక్రవారం, శనివారం కూడా కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు గురువారం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు సెషన్‌లలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి జరిగిన మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,449 మందికి 2393 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 56 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 2,450 మందికి 2395 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 55 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులనుఅనుమతించారు.

కొనుగోలు కేంద్రాలకు స్థలాల కొరత

- రోడ్ల పైనే ధాన్యం కుప్పలు

- ప్రమాదమని తెలిసినా రైతన్నకు తప్పని దుస్థితి

పెగడపల్లి, మే 9: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలు ఆయకట్టు పరిదిలోని ఉన్నాయి. మండలంలోని 90 శాతానికి పైగా భూములలో వరి పంటనే సాగు చేస్తారు. పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు మండలంలోని పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాలతో పాటు సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల చేత ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోల్లు చేస్తున్నారు. ఆయా గ్రామాలలోనే రైతులకు అందుబాటులోనే కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికి వాటికి సరైన స్థలాలు లేక ప్రధాన రహదారులైన తారు రోడ్లకు ఇరువైపులా ధాన్యం కుప్పలు పోసి తూకం వేయించుకోవాల్సిన పరిస్థితులు అన్ని గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలలో ఉంది. దీనికి తోడు గుట్ట బోర్లకు, పంట పొలాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎగుడు దిగుడు భూములలో ధాన్యం పోసి చిన్న పాటి వర్షం వచ్చినా ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. గుట్టబోర్ల పైన ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఏ కొద్ది వర్షం పడినా ధాన్యం కొట్టుకు పోతుండగా , పంట పొలాలలో ఏర్పాటు చేసి కేంద్రాలలో వర్షాలు కురిసినపుడు ధాన్యం కుప్పలు, తూకం వేసిన సంచులు తడిసిపోతున్నాయి. దీంతో తూకం వేయకపోవడం తడిసిన ధాన్యం పేరిట తరుగు తీయడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మండలంలో ప్రతి పంటకు 3.50 లక్షల నుంచి 4 లక్షల క్వింటాల్ల వరకు ధాన్యం తూకం వేస్తుండగా మండలంలోని 23 గ్రామాలలో ఎక్కడా కూడా శాశ్వత స్థలాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు అధికారులకు ప్రతి యేటా రైతులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. రైతుల శ్రేయస్సు గురించి మాట్లాడే ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు చూపించి సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత స్థలాలు కేటాయించాలి..

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అన్ని గ్రామాలలో ప్రభుత్వ స్థలాలను కేటాయించి శాశ్వత కేంద్రాలు ఏర్పాటు చేయాలి, ఎంతో కష్టపడి పండించిన ధాన్యం విక్రయించుకుందామంటే సరైన కేంద్రాలు లేక మట్టిలో, ఎగుడు దిగుడు స్థలాలలో ధాన్యం కుప్పలు పోసి ఇబ్బందులు పడుతున్నాం. పండించిన ధాన్యం మట్టిలో కలసిపోతోంది. కొనుగోలు కేంద్రాలలో సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసి ధాన్యం మట్టిలో కలసి పోకుండా చూడాలి.

- ప్రశాంత్ రావు. పెగడపల్లి.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు

శంకర జయంతి ఉత్సవాలు ప్రారంభం



శంకరాచార్యుల వారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మే 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ శంకర జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో ఆలయ అర్చకులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి అద్దాల మండపంలో శ్రీ శంకరాచార్యుల చిత్రపటానికి ఉపనిషత్ ద్వారాభిషేకం, పూజలు గావించారు. శంకర పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు శ్రీ స్వామివార్లకు, శ్రీ శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

మహిళా ఖైదీల పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు కృషి



జైలును సందర్శించిన సీడబ్ల్యూసీ సభ్యులు

కరీంనగర్ క్రైం, మే 9: మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి విద్య, ఆశ్రయం, ఉపకార వేత నం అందించేందుకు కృషి చేస్తామని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి అన్నారు. జైలులో ఉన్న మహిళలకు సంబంధించిన పిల్లల రక్షణ, సంరక్షణ, విద్యా తదితర విషయాలను తెలుసుకునేందుకు కరీంనగర్ బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) ప్రతినిధులు గురువారం కరీంనగర్ జైలు అధికారులతో కలిసి జైలులోని మహిళా విభాగం బారక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న మహిళఖైదీలతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి చేయూతనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు అధికారులు రమేశ్, సంగీత, బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగశేఖర్, విజయ్, రాధా, అర్చనరెడ్డి, జైలు అధికారులు పాల్గొన్నారు.

చేపల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

- ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఘటన

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో చేపలను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలు ముత్యాల బాలకృష్ణ (38) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కిషన్ అతడి స్నేహితులు పుటకుల్ల సుధీర్, బొమ్మడి శంకర్‌తో కలిసి చేపలు పట్టేందుకు గ్రామ శివారులోని మానేరు వాగులోని చెక్ డ్యాం వద్దకు వెళ్లారు. నీటిలో తీగలను అమర్చి వాటికి కరెంటు సరఫరా అయ్యేలా ఏర్పాటు చేసుకున్నారు. ప్రమాదవశాత్తు కిషన్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆందోళనకు గురైన సుధీర్, శంకర్ అక్కడి నుంచి పారిపోయారు. అక్కడే ఉన్న వ్యక్తులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య, పిల్లలు రోదనలు మిన్నంటాయి. సుధీర్, శంకర్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. మృతుడికి భార్య కావ్య, ఇద్దరు కూతుళ్లు సహస్ర, లాస్యప్రియ, కుమారుడు అఖిల్‌తేజ్ ఉన్నారు. గత యేడాది జూలై 2న అదే గ్రామానికి చెందిన బొమ్మడి నారాయణ చేపల వేటకు వెళ్లి కరెంటు షాక్‌తో మృతి చెందాడు. విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడడంతో ప్రమాదవశాత్తు ప్రాణాలను కోల్పోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



హరీష్(ఫైల్)

పాలకుర్తి, మే 9: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బసంత్‌నగర్‌కు చెందిన కొమ్మ హరీష్(24) సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షానికి గోడలు తడిసి పైన ఉన్న బట్టలు ఆరవేసే దండానికి విద్యుత్ సరఫరా అయ్యింది. ఇది గమనించని హరీష్ చెయ్యి పైకి లేపడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు, స్నేహితులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. అవివాహితుడైన హరీష్‌కు తల్లి, సోదరుడు ఉన్నారు. బసంత్‌నగర్ ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో సహాయకుడిగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రిజర్వేషన్ల రద్దు ప్రచారం కుట్ర

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

భగత్‌నగర్, మే 9: బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ ప్రచారం చేయడం వెనుక కుట్ర దాగి ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలో భాగమే అన్నారు. అంబేద్కర ప్రజాస్వామ్య దేశంలోని అనేక విషయాలను జోడించి ప్రపంచంలోనే ఆదర్శమైన రాజ్యాంగాన్ని రాశారన్నారు. దళితుడైన అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్‌భగత్ మాట్లాడిన అంశాలను వక్రీకరిస్తున్నారని ఎస్.కుమార్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

మల్యాల, మే 9: మండలంలోని నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద గుడుంబా అమ్ముతున్న నూకపల్లికి చెందిన సిలువేరి లక్ష్మి వద్ద మూడు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మికి గుడుంబాను సరఫరా చేస్తున్న రాజరం గ్రామానికి చెందిన తిరుమలేష్‌తో పాటు లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

క్యాన్సర్‌కన్నా ప్రమాదకరమైనది కాంగ్రెస్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ

రాయికల్, మే 9: క్యాన్సర్‌కన్నా ప్రమాదకరమైనది కాంగ్రెస్ పార్టీ అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. రాయికల్ మండల కేంద్రంలో గురువారం నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అరవై ఏళ్ల పాలనకు చరమ గీతం పాడి ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ధర్మపురి అర్వింద్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోగ శ్రావణి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ రావు, రాయికల్ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ పడాల తిరుపతి, కౌన్సిలర్ కల్లెడ సునీత, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, పాల్గొన్నారు. మండలంలోని మూటపెల్లి గ్రామంలో అర్వింద్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

మెట్‌పల్లి : దేశ భద్రత కోసం బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారం లోకి రావడానికి నిజామాబాద్ పార్లమెంట్ పార్టీ అభ్యర్థి ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ప్రజలను కోరారు. గురువారం పట్టణంలోని రెడ్డి కాలనీల్లో ఆర్యవైశ్య సంఘంతో పాటు పలు కుల సంఘాలను కలిసి బీజేపీకి మద్దతు పలికి అర్వింద్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగభూషణం, మహాజన్ నరసింహులు, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

●లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఎంపీ ధర్మపురి అరవింద్ గెలుపు కోసం మెట్‌పల్లిలో నాయకులు కాళ్ళు మొక్కుతూ ప్రచారం చేపట్టారు. గురువారం పట్టణంలోని ఇంటింటికి వెళ్ళి ఓటర్ల కాళ్ళకు పాదాభివందనం చేస్తూ ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు బోడ్ల ఆనంద్, లక్ష్మణ్, విజయ్, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ మోదీతోనే సాధ్యం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం

మల్లాపూర్, మే, 9 : దేశంలో ఎస్సీ వర్గీకరణ ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందని, మళ్లీ దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు రాష్ట్రంలోని మాదిగల మద్దతు పలుకుతున్నరని ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క స్థానం కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీ మాదిగలను ఓటు అడిగే అర్హత లేదన్నారు. మాదిగల చిరకాల ఆ కాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధ కల్పించే బాధ్యతను తీసుకున్న ప్రధా న మంత్రి నరేంద్రమోదీకి అండగా నిలబడాలన్నారు. నిజామాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఎంపీ అర్వింద్ గెలుపు కోసం మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ప్రచారం చేపట్టడానికి మల్లాపూర్‌కు వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సురుగు శ్రీను, పద్మశాలి జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, భూచాన్న, గోపిడి శ్రీను, ఎర్ర లక్ష్మి పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

వెల్గటూర్, మే 9: పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓటు వేసి ఎం.పీ గా భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి కొప్పుల స్నేహలత అభ్యర్థించారు. వెల్గటూర్ మండల కేంద్రంలో గురువారం మండల నాయకులతో కలసి ఇంటింటా తిరుగుతూ, ఉపాధి హామీ కూలీలను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉంటూ ప్రజల కోసం తపించే నాయకుడిగా పేరున్న కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టు మిషన్ల పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అడెపు కమల-మధు

కోరుట్ల, మే 9: పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్, కోటి నవదుర్గ లయన్స్ క్లబ్ మహిళ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం నిరుపేదలకు కట్టుమిషన్లను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్, కోటి నవదుర్గ లయన్స్ క్లబ్ సభ్యులు ఆడెపు కమల - మధుల కుమార్తె రష్మిత పుట్టిన రోజు పురస్కరించుకొని నిరుపేదలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ సభ్యులు కుందారపు ప్రేమలత, కొండబత్తిని రాధిక కాలనీ వాసులు షాహిన్, ఇలియాస్ ఖాన్, నజ్జు, హసన్, కమర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన జమునాదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో

వెల్గటూర్, మే 9: వెల్గటూర్ మండల విద్యాధికారిగా గొల్లపెల్లి ఎంఈవో జమునాదేవి గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతంలో వెల్గటూర్, ఎండపల్లి, ధర్మపురి, బుగ్గారం నాలుగు మండలాలకు విద్యాధికారిగా వ్యవహరించిన బత్తుల భూమయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందగా ఆయన స్థానంలో వెల్గటూర్ మండల విద్యాధికారిగా జమునాదేవి బాధ్యతలు స్వీకరించారు. కాగా మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్‌లు కవిత, అశ్విని, సీసీవో శ్రీనివాస్, సీఆర్పీలు రజిని, రాజారాణి, ఐఈఆర్పీలు శ్రీనివాస్, శ్రీలత, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ స్ఫూర్తి, దీవెనలతోనే రాష్ట్రసాధన

● బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

కరీంనగర్, మే 9(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): తెలంగాణ ఉద్యమంలో కరీం నగర్ పాత్ర కీలకం.. ఉద్యమాల గడ్డ కరీంనగర్ స్ఫూర్తి, దీవెనలతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గులాబీ జెండా ఎత్తుకొని ఎస్ఆర్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో జై తెలంగాణ నినాదంతో ముందుకు సాగిన నన్ను ఆశీర్వదించిన గడ్డ కరీంనగర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలి దశ ఉద్యమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు సవా ల్ విసిరితే రాజీనామాతో కరీంనగర్ నుంచి పోటీచేశానని, అప్పుడు 2.50 లక్షల మెజార్టీతో గెలిపించారని కేసీఆర్ గుర్తుచేశారు. ఎప్పుడు కరీంనగర్‌కు వచ్చిన బ్రహ్మాండంగా స్వాగతించారని, కరీంనగర్‌కు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. అటువంటి ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ చాటి ఎంపీగా ఉద్యమనేత, మేధావి, న్యాయవాది బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి కరీంనగర్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వినోద్ కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన బస్సుయాత్ర, రోడ్ షో సందర్భంగా తెలంగాణ చౌక్‌లో ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. కరీం నగర్‌లో నా సర్వే ప్రకారం 8శాతం ఓట్ల ఆధిక్యతతో వినోద్‌కుమార్ ముం దంజలో ఉన్నారని, ఆయన గెలుపు ఖాయమైందని అన్నారు.

కరీంనగర్‌లో ముస్లిం మైనార్టీలు ఆలోచించాలని, మీరు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీ అభ్యర్థి గెలుస్తాడని, మత విద్వేషాలు రెచ్చగొట్టే బండి సంజయ్‌ని ఓడించి, సెక్యూలర్ వాది, ఉద్యమ కార్యకర్త వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. నరేంద్రమోదీ భావోద్వేగాల బ్లాక్ మెయిల్ ఇలాగే కొనసాగితే దేశం సర్వనాశనమవుతుందన్నారు. పదేళ్ల క్రితం 150 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ, నరేంద్రమోదీ అందు లో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు.

బీఆర్ఎస్ తోనే అన్నివర్గాలకు న్యాయం

జగిత్యాలరూరల్, మే 9 : బీఆర్ఎస్ తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని చర్లపల్లి, హన్మాజీపేట, కండ్లపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఆరుగ్యారంటీలు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. ఈకార్యక్రమం లో నాయకులు బాలముకుందం, ఆనంద్‌రావు, శేఖర్, దామోదర్, నర్సయ్య, గంగారాం, మహిపాల్, ప్రభాకర్ రావు, భూంరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

మల్యాల, మే 9: కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బి.వినోద్‌కుమార్‌కు మద్దతుగా జడ్పీటీసీ కె.రామ్మోహన్ రావు తదితరులు మండలంలోని తాటిపల్లితో పాటు పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలు, ఓటర్లను కలిసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, బెజ్జంకి చినదుర్గయ్య, రాజేంధర్‌రెడ్డి, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం..

ఎండపల్లి, మే 9: పెద్దపల్లి పార్లమెంట్ అభర్థిగా గడ్డం వంశీకృష్ణ చేతి గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజారిటీ తో గెలిపించి, పార్లమెంట్ పంపేందుకు ఆయనకు ఒక్క అవకాశం ఇవ్వాలని నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని గుళ్లకోట గ్రామంలో ఉపాధి హామీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాల న్నారు. మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, సత్యం, మల్లేశం, భూమయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

రాయికల్, మే 9: రాయికల్ పట్టణంలోని 4వ వార్డులో ఎండాకాలం కారణంగా నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. వార్డులో నీటి ఎద్దడి ఉన్నందున వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాలని కోరారు. కౌన్సిలర్ శ్రీధర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

కొడిమ్యాల, మే 9 : కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గురువారం కొడిమ్యాల, మండలంలోని చెప్యాల, పూడూర్, రామకిష్టాపూర్, నాచుపల్లిగ్రామాల్లో ఇం టింట ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కు మార్‌ను పార్లమెంట్‌కు పంపాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, ఆదన్న, వెంకటేష్ గౌడ్, లింగాగౌడ్, అబ్రహం, సాయి ఉన్నారు.

కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



గొల్లపల్లిలో మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

గొల్లపల్లి, మే 9: పదేళ్ల పాలనలో నరేంద్ర మోదీ కార్పొరేటర్లకు తప్ప సామాన్య జనానికి చేసింది ఏం లేదని, ఈ విషయాన్ని సామాన్య జనం గుర్తించి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయడం ద్వారా కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం గొల్లపల్లి మడండల మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌లో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్, బీ జేపీ మోసపూరిత మాటలు ప్రజలు నమ్మొద్దన్నారు. ఈ ఎన్నికల్లో చేతి గుర్తు కు ఓటు చేసి వంశీకృష్ణను గెలిపించాలని వారు కోరారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో కలిసి గురువారం బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక పటేల్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలను తాను వంశీకృష్ణ రెండు కళ్లలాగా కాపాడుకుంటానని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు అండగా నిలవాలన్నారు. అభ్యర్థి వంశీకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం జై శ్రీరామ్ అనే పేరుతో ఓట్లు అడిగే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, వెల్గటూర్ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజేష్, రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్ర సాద్ పాల్గొన్నారు.

పెగడపల్లి : కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలలో పట్టం కట్టాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని బతికెనపల్లిలో ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థితో కలిసి కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఈఎన్నికలో రాష్ట్రంలో ఓట్లడిగే హక్కు లేదని పేర్కొన్నారు. గడ్డం వంశీని అత్యదిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమలు మంజూరు చేయించి యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా మండల నాయకులు రాములు గౌడ్, ఒరుగల శ్రీనివాస్, కరారి చంద్రశేఖర్ రావు, కాటం ప్రకాశ్ రెడ్డి, శోభారాణి, మల్లారెడ్డి, శైలజ, విజయలక్ష్మి, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మొద్దు

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, మే, 9 : కాంగ్రెస్, బీజేపీ నాయకులు మళ్లీ లోక్ సభ ఎన్నికల్లో మోసం చేయడానికి మోసపూరిత మాటలతో వచ్చే వారిని నమ్మొద్దని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వ కుంట్ల విద్యాసాగర్‌రావులు అన్నారు. గురువారం మండలంలోని రామారావుపల్లె, పెద్దాపూర్, చౌలమద్ది, కోనారావుపేట, కొండ్రికర్ల, ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాల్లో పర్యటించి నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కిందని, కాంగ్రెస్, ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలపై గ్రామాల్లో చర్చలు జరపాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి కరెంట్ సరఫరా సరిగా లేదని, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మాయమాటలు చెప్పి ఇప్పటికి అమలు చేయ్యకుండా ఇబ్బందులకు నెట్టిందని విమర్శించారు. దీంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసం పోయిందన్నారు. బీజేపీ ప్రభుత్వం పసుపు బోర్డు ప్రకటించిన తర్వాత ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై స్పష్టత రాకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. ఎంపీ అర్వింద్ ఎన్నికల సమయంలో వంద డబుల్‌బెడ్ రూమ్‌లను కట్టిస్తానని చెప్పి ఏ ఒక్కరికి ఇవ్వలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అబద్ధపు మాటలతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని, వారి మాటాలను నమ్మవద్దని సూచించారు. బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచులు కోరెపు రవి, చౌట్‌పల్లి లావణ్య-అంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డ రాజారెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాలలో జీవన్ రెడ్డి కుటుంబ పాలన నడుస్తోంది

నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



విలేకరులతో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కుటుంబ పాలన నడుస్తుందని నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్సీ రమణ నివాసంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెడుతారన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇటీవల బావోద్వేగాల మాటలతో ఓట్లు అడుగుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రభుత్వంలో ఉండి, అధికారంలో ఉండి రైతులను ఆదుకోవడంపై శ్రద్ధవహించకపోవడం దౌర్భాగ్యం అన్నారు. మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ నుంచి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా ఎన్నికయిన జీవన్‌రెడ్డి ఉద్యోగస్తుల సాధకబాధకాల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారని, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, ఆయన కుటుంబంలో అందరూ పదవుల్లో ఉండాలి..మిగిలిన వారు ఉండకూడదన్న దోరణిలో జీవన్‌రెడ్డి వ్యహరిస్తున్నారని విమర్శించారు. జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు భావోద్వేగ ప్రసంగాలు చేస్తూ ప్రజల మనస్సును డైవర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు గమనించి తప్పకుండా ఓటు ద్వారా తగిన గుణపాఠం చెబుతారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా ధాన్యం క్వింటాలుకు రూ. 500 బోనస్‌ను కాంగ్రెస్ అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడ, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ మంత్రి రాజేశం గౌడ్ పాల్గొన్నారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో ఎప్ సెట్ ప్రారంభం

కొడిమ్యాల, మే 9 : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎప్ సెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడున్నర గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రానికి అనుమతించారు. జేఎన్‌టీయూలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రానికి 100 మంది విద్యార్థులు అలాట్ కాగా గాను 90 మంది విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షకు హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెంట్ అసోసీయెట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

కథలాపూర్, మే 9 : మండలంలోని దూలూరు, తక్కళ్లపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బొమ్మెన నుంచి పూండ్ర వినోద్, మేడిపల్లి నరేశ్, యేలేటి వినోద్, ఏనుగు హన్మాండ్లు, తక్కళ్ళపల్లి నుంచి అడ్నాల సాయాబు పార్టీలో చేరగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, మండల ఉపాధ్యక్షుడు శ్రీహరి ఉన్నారు.

బీజేపీలో చేరిన యువకులు

కొడిమ్యాల, మే 9 : కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో గురువారం కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన బాస్కర్‌రెడ్డి రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, మదు, నరేష్, శ్రీకాంత్ మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభ, బీజేపీ నాయకులు ఉన్నారు.

సారంగాపూర్ : నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కోనాపూర్ మాజీ ఉప సర్పంచ్ అనంతుల స్వామి గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టరు బోగ శ్రావణి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. మండల స్వర్ణకార సంఘం అధ్యక్షులు సింహరాజుల కిషన్, పలువురు నాయకులు చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వరుణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి శాంతన్న పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రమ

రాయికల్, మే 9: రాయికల్ పట్టణ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా వాసం రమ గురువారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి నియామక పత్రం అందజేశారు. పార్టీ పటిష్ఠతకు మరింత కృషి చేయాలని కోరారు.

పద్మశాలీలకు తోడుగా ఉంటా

- కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



కరీంనగర్‌లో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, మే 9: కులవృత్తులను కాపాడటంలో దశాబ్దాల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీదే పైచేయి అని ఆ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. నగరంలోని పద్మశాలి భవన్‌లో గురువారం ఆ సంఘం నేతలతో రాజేందర్‌రావు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ కుల వృత్తులను రక్షించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇప్పటికే సిరిసిల్ల చేనేత కార్మికులకు చేసే సేవలో నిమిత్తం ఒక మేనిఫెస్టో విడుదల చేసినట్లు తెలిపారు. మోసపూరిత ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను దరిదాపులకు రానివ్వవద్దని సూచించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారాయణగౌడ్, జిల్లాపద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, మాజీ ఎంపీపీ వొల్లాల కృష్ణహరి, మాజీ జెడ్పీ టీసీ అరుకాల వీరేశలింగం, మాజీసర్పంచ్ గడ్డం శ్రీరాములు పాల్గొన్నారు.

దేశ సంపద అదానీ, అంబానీలకు పంచిపెడుతున్న బీజేపీ..

మేడిపల్లి: దేశ సంపద అంతా అదానీ, అంబానీలకు బీజేపీ పంచి పెడుతున్నదని, బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అందుకే కాంగ్రెస్ పార్టీకి ఓటువేయాలని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తొంబర్రావుపేట, గూడ్లపల్లి, పోరుమల్ల, కట్లకుంట, కొండాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, తోకల రవి, రాజేందర్‌రెడ్డి, పెద్దిరెడ్డి ప్రణయ్‌రెడ్డి, బలగంరాజేష్, నర్సరెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు

కథలాపూర్: నరేంద్ర మోదీ పాలన లో బడుగు జీవులకు భారీ నష్టం సంభవించిం దని. కార్పోరేట్ శక్తులకు పెద్దపీట వేశారని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి వెన్న సురేశ్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. సీపీఐ నాయకులు చెన్నవేని దశరథం, భూమయ్య, మురళి, శేఖర్, భూమయ్య, రాజం ఉన్నారు.

కొడిమ్యాల: కరీంనగర్ ఎంపీగా రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు పూడూర్, రామకిష్టాపూర్‌లో ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మల్లేశం, రామస్వామి, అయిలయ్య, అజయ్‌రెడ్డి, రాఘవరెడ్డి, తిరుపతిగౌడ్, రవి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ వద్ద ఫోన్ ట్యాపింగ్ పైసలు

- కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్



తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

తిమ్మాపూర్, మే 9: కాంగ్రెస్ పార్టీ వద్ద ఫోన్ ట్యాపింగ్ పైసలు ఉన్నాయని కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే, ఫోన్ ట్యాపింగ్‌పై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావచ్చు అని కరీంనగర్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలగునూర్‌లో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి పోలింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై పోలింగ్ ఏజెంట్లు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మూసివేసిందని, ఎవ్వరి నోట నుంచి కూడా ఫోన్ ట్యాపింగ్ మాట రావడం లేదన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, నాయకులు గడ్డం ఆరుణ్, ఇతర రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

గంగాధర: ప్రజాస్వామ్యంలో ఓట్లు అడిగితే బిచ్చగాళ్లంటారా.. బీజేపీ నేతలు హిందువుల పేరు చెప్పుకుని ఓట్లు అడుక్కునే బిచ్చగాళ్లంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బండిసంజయ్ కుమార్ స్పందించారు. గురువారం గంగాధర మండలం వెంకటయ్యపల్లి ఫంక్షన్‌హాల్‌లో చొప్పదండి నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పలు పార్టీల నుంచి బీజేపీలో చేరిన నాయకులకు కాషాయ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, ఆరు మండలాల మండలాధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సాధించిన ఘనత నరేంద్ర మోదీకే దక్కిందని బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మధుశ్రీ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు సిరికొండలో కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మేడిపల్లి: మండలంలోని మాచాపూర్, దమ్మన్నపేటలో బీజేపీ పార్లమెంటు కో కన్వీనర్ దశరథరెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్‌కి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.